క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం రమేష్

కొత్తవలస: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ సోమవారం ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టుకు డీఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి రవిపాత్రుడు, ఆర్టీసీ సిబ్బంది టి.రాములు, వెంకటరావు,ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో భోజనాల పరిశీలన



వంటకాలను పరిశీలిస్తున్న ఆరోగ్యమిత్రలు

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స తీసుకుంటున్న రోగులకు అందిస్తున్న భోజనాల నాణ్యతను ఆరోగ్య మిత్రలు ప్రదీప్,నారాయణరావు సోమవారం పరిశీలించారు. వార్డులో ఉన్న రోగులతో మాట్లాడి భోజనాల నాణ్యతపై ఆరా తీశారు. ఆహార నాణ్యతపై కొద్ది రోజుల క్రితం ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయకర్త అప్పారావు ఆదేశాల మేరకు భోజనాలను పరిశీలించామని, భోజనాల నాణ్యతపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారని ఆరోగ్యమిత్రలు తెలిపారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

గుర్ల: పోలాయవలస గ్రామంలో రామాలయం వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.ఆలయం వద్ద మధ్యాహ్నం మూడు వేల మందికి అన్నదానం చేశారు.సర్పంచ్ ద్వారపూడి అప్పారావు, స్థానిక నాయకుడు నాగులపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

నీటి తొట్టెల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తాం



గరుగుబిల్లిలో తాగునీటి తొట్టె నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు 16 నీటి తొట్టెల నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేసిందని ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ తెలిపారు. మండలంలోని గరుగుబిల్లిలో పశువుల తాగునీటి తొట్టె నిర్మాణ పనులను సోమ వారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క తాగునీటి తొట్టె నిర్మాణానికి రూ.30 వేలు ఇస్తున్నామని ఏపీఓ చెప్పారు. గరుగుబిల్లి, గర్భాం, రాచగుమడాం లో తాగునీటి తొట్టెల నిర్మాణం పూర్తయ్యిందని, మిగతా 13 నిర్మాణాలను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

తాగునీటి పరీక్షలు



తాగునీటిలో క్లోరిన్ శాతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ

మెరకముడిదాం: గర్భాం మేజర్ పంచాయతీలో రక్షిత మంచి నీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివబాబు సోమవారం పరీక్షలు నిర్వహించారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు నుంచి తాగునీటి శాంపిల్స్ సేకరించి క్లోరిన్ శాతాన్ని పరీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లోరిన్ స్థాయి తగినంతలోనే ఉందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామని చెప్పారు. గొట్టుపల్లి, ఎం.గదబవలస, ఎం.రావివలస, రామాయవలస గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్‌లకు, కుళాయిలకు మరమ్మతులు చేపట్టనున్నామని తెలిపారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ ఉన్నారు.

తాటితో ఆరోగ్యం... ఆదాయం





- వేసవి తాపాన్ని తీర్చుతున్న ఐస్ యాపిల్
- తాటి ముంజుల్లో పుష్కలంగా పోషకాలు
- ఆరోగ్యానికి మేలు అంటున్న వైద్యనిపుణులు
- వేసవిలో తాటికాయలు, ముంజులు అమ్మకమే గీత కార్మికులకు జీవనాధారం
- అరకు- విశాఖ రోడ్డులో తాటి ముంజులు విక్రయాలు
- డజన్ రూ.40 నుంచి రూ.60కి అమ్మకం

లక్కవరపుకోట: వేసవిలో లభించే తాటి ముంజులు వల్ల బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.వేసవి తాపాన్ని తీర్చడంలో ఐస్ యాపిల్‌గా పిలుచుకునే తాటి ముంజులకు సాటి మరేవీ రావు. మార్చి నెలాఖరు నుంచి జూన్ నెలాఖరు వరకు ఇవి లభిస్తాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల శరీరంలోని నీరు చెమట రూపంలో ఎక్కువగా బయటకు పోతుంటుందని, అటువంటి సమయంలో తాటి ముంజులను తీసుకుంటే శరీరంలోకి ద్రవాలు చేరి డీహైడ్రేషన్ నుంచి తప్పించు కోవచ్చన్నది వైద్యుల మాట.అలాగే వీటిలో విటమిన్ ఏ,బీ,సీలతో పాటు ఐరన్, జింక్, కాల్షియం, మెగ్నీషియం, పాస్పరస్, పొటాషియం, సోడియం, సల్ఫర్, కాపర్ లాంటి ఖనిజ లవణాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. తాటి ముంజులు శరీర బరువును తగ్గించడంలో, కాలేయ సంబంధిత సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే పొటాషియం శరీరంలోని విషపదార్థాలను తొలగించడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఎండల కారణంగా వాంతులు, విరేచనాల బారినపడిన వారికి తాటి ముంజులను తినిపిస్తే ఆ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని, వెంటనే శక్తి వస్తుందని, సుగర్‌ఉన్న వారు కూడా వీటిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.గర్భిణులు కూడా తాటి ముంజులు తింటే మంచిదేనని వైద్యులు అంటున్నారు.ప్రెగ్నెన్సీ సమయంలో ఎదురయ్యే మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలను దూరం చేయడంలో, జీర్ణవ్యవస్థ చురుగ్గా పని చేయడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

నాలుగు నెలలు ఉపాధి

ఎల్.కోట, కొత్తవలస మండలాల్లోని అరకు–విశాఖపట్నం రోడ్డులో ఎక్కడికక్కడ గీతకార్మికులు చెట్ల కింద తాటి ముంజులను విక్రయిస్తున్నారు. ఎల్.కోట, వేపాడ, ఎస్.కోట మండలాల్లోని పొలాల్లో తాటి చెట్లు ఎక్కువగా ఉండడంతో ఈ మండలాలకు చెందిన వారితో పాటు విశాఖపట్నం జిల్లాలోని పెదగంట్యాడ, భీమిలి, ఆనందపురం, గాజువాక తదితర ప్రాంతాలకు చెందిన గీతకార్మికులు ఇక్కడికి వచ్చి తాటి కాయలను సేకరిస్తున్నారు.ఉదయం 6 గంటలకే ఒక్కొక్కరూ 10 నుంచి 15 చెట్లు ఎక్కి తాటికాయలను సేకరించి వాటిని వలిచి ముంజులు తీస్తున్నారు. వీటిని కొందరు అరకు -విశాఖపట్నం రోడ్డులో పర్యాటకులు, ప్రయాణికులకు, మరికొందరు విశాఖపట్నం సిటీకి తీసుకువెళ్లి విక్రయిస్తు న్నారు. గీతకార్మికులకు దాదాపు నాలుగు నెలల పాటు ఈ విధంగా ఉపాధి పొందుతున్నారు. డజన్ ముంజులు రూ.40 నుంచి రూ.60 వరకు అమ్ముతున్నారు. భార్యాభర్తలు కష్టపడి రోజుకు సుమారు రూ.1500కుపైగా సంపాదిస్తు న్నారు.

విశాఖపట్నం తీసుకువెళ్లి విక్రయిస్తున్నాం..



మాది విశాఖ జిల్లా పద్మనాభం మండలం. ఎల్.కోట మండలంలో తాటిచెట్లు అధికంగా ఉండడంతో ఏటా వేసవిలో ఈ ప్రాంతానికి వచ్చి నివాసం ఉంటాం. రోజూ ఉదయాన్నే తాటి చెట్లుఎక్కి కాయలను సేకరించి, వాటిని ఆటోలో విశాఖపట్నం తీసు కెళ్లి విక్రయిస్తాం. వేసవి సీజన్‌లో తాటి కాయలు, ముంజులను అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. సీజన్ అయిపోతే మా గ్రామానికి వెళ్లిపోతాను. – ఆర్.ఎర్నాయుడు, పద్మనాభం మండలం, విశాఖపట్నం జిల్లా

రోజుకు రూ.1200 ఆదాయం



నాభర్త రోజూ 15 తాటి చెట్లు వరకు ఎక్కి తాటి కాయలను సేకరిస్తుంటారు. వాటిని వలిచి ముంజులను తీసి గాజువాక,పెదగంట్యాడ ప్రాంతాల్లోని వీధుల్లో అమ్ముతాం. సుమారుగా రోజుకు రూ. 1200 ఆదాయం సంపాదిస్తాం. వాటితోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. – ఎం.సింహాచలం,ఖాసాపేట గ్రామం , ఎల్.కోట మండలం

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎంలు

చీపురుపల్లి: సుదూర ప్రాంతాల నుంచి రోజూ రైల్వే ఎంఎస్‌టీ పాస్ ద్వారా ప్రయాణిస్తూ చీపురుపల్లి, గరివిడి మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న నలుగురు ఉపాధ్యాయులను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమ వారం సత్కరించారు. బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వస్తూ, సమయపాలన పాటిస్తూ ఆదర్శవంతంగా పాఠ్యాంశాలు బోధించడం ఎంతో గొప్ప విషయమని ఉపాధ్యాయులు ఏ.వి.శ్రీనివాస్, ఆర్.వి.బి.సాయిరాం, బి.సూర్యనారాయణ, కె.రత్నప్రభను అభినందించారు. కాపుశంభాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.రాము, ఉపాధ్యాయులు లక్కోజు శేషగిరి, బి.జ్యోతి, గణేశ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశాలకు సోమ వారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 102 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 74 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

పిల్లల్లో ఊబకాయం రాకుండా చూసుకోవాలి



గంట్యాడ: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం

- ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం

గంట్యాడ: పిల్లల్లో ఊబకాయం రాకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం సూచించారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామవరం గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతీ అంగన్‌వాడీ కార్యకర్త తన పరిధిలో ఉన్న పిల్లల ఎదుగుదలపై నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు అధిక పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. గర్భిణుల వివరాల రిజిస్ట్రేషన్ సకాలంలో జరగాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా పౌష్టి కాహారాన్ని తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకోవాలని గర్భిణులకు సూచించారు.అనంతరం గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్న ప్రాసన చేశారు. స్థానిక సర్పంచ్ పీరుబండి పద్మ, పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత, ఐసీడీఎస్ పీఓ ఉమా భారతి , ఎంఈఓ విజయకుమారి పాల్గొన్నారు.

చిన్నారుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ


శృంగవరపుకోట: చిన్నారుల పోషణపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐసీడీఎస్ పీఓ ఎం.ఉమ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ పక్వాడ ముగింపు వేడుకలు సోమ వారం నిర్వహించారు. పిల్లల వెయ్యి రోజుల సంరక్షణపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించా రు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ డీఓ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పిల్లల శారీరక,మానసిక ఎదుగుదలకు పోషకాహారం ముఖ్యమన్నారు. ఈఓపీఆర్డీ లక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసు కుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బాలింతలు, గర్భిణులకు పోషకాహార నియమాలను వివరించారు. పిల్లల్లో ఊబకాయ సమస్య రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి మానస అవగాహన కల్పించారు.అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. మహిళా అధికారులు, ఉద్యోగులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు పసుపు,కుంకుమ, పువ్వులు, పండ్లు అందజేసి, గాజులు తొడిగి ఆశీర్వదించారు. చిన్నారులకు అన్న ప్రసాన చేశారు. ఏఎన్‌ఎంలు, ఎంఎస్‌కేలు, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: ఎస్.కోట ఐసీడీఎస్ కార్యాలయంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

ధ్యానంతో ఆరోగ్యం

చీపురుపల్లిరూరల్(గరివిడి): ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు అన్నారు. గరివిడి పట్టణంలోని టి.ఎస్.ఎన్.రాజు కల్యాణ మండపంలో యోగా శిక్షకులు సూరి గురాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ధ్యాన ఆరోగ్య శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ పది రోజులపాటు నిర్వహించనున్న ధ్యాన శిక్షణ తరగతులను పిల్లలు, పెద్దలు అంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజూ ధ్యానం, యోగాసాధన చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు దూరమవుతాయని చెప్పారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని, ధ్యానం ద్వారా దానిని అధిగవించవచ్చని తెలిపారు. యోగా శిక్షకులు సూరి గురాజీ మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయన్నారు. రోజూ ఉదయం 5:30 గంటల నుంచి 7 వరకు, తిరిగి సాయంత్రం 6:30 గంటల నుంచి 8:00 గంటల వరకు శిక్షణ తరగుతులు ఉంటాయని పేర్కొన్నారు.



ధ్యాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

సామూహిక సీమంతం



పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా కొత్తవలస మండల కేంద్రంలోని గిడిజాల రోడ్డులో ఉన్న వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఐసీడీఎస్ సిబ్బంది గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతం చేశారు. ఐసీడీఎస్ అధికారులతో పాటు అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి గర్భిణులకు పూలు, పండ్లు, స్వీట్లు అందజేసి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. వైద్యాధికారి సీతల్ వర్మ, ఐసీడీఎస్ పీఓ, సహాయ పీఓ రొంగళి ఉమాదేవి, లక్ష్మీబాయి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు. – కొత్తవలస

అమ్మకు పాదపూజ



గంట్యాడ మండలంలోని చినమధుపాడ గ్రామ ప్రాథమిక పాఠశాల వారికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లులకు పాదపూజ చేశారు. తల్లుల పాదాలను కడిగి, పసుపు, గంధం పూసి తాంబూలం అంద జేసి వారి దీవెనలు అందుకున్నారు. అనంతరం పిల్లలు నృత్యాలు, నాటికల ప్రదర్శనతో సందడి చేశారు. హెచ్‌ఎం బంకపల్లి శివప్రసాద్, ఉపాధ్యాయులు జి.వి.శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు. – గంట్యాడ

నవధాన్యాల సాగు..నేలతల్లి బాగు



లక్కవరపుకోట: చందులూరు రైతు సేవా కేంద్రంలో రైతులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

లక్కవరపుకోట/కొత్తవలస: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ కో– ఆర్డినేటర్ ప్రకాష్ తెలిపారు. ఎల్.కోట మండలంలోని చందులూరు, కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి,దెందేరు చీడివలస గ్రామాల్లో రైతులకు నవధాన్యాల సాగు, వాటితో కలిగే ప్రయోజనాలపై ప్రకృతివ్యవసాయ సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రకాష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూమి గుల్లబారుతుందన్నారు. ఖరీఫ్ వరి సాగు చేయడానికి పొలాల్లో నవధాన్యాలను చల్లి, చేను ఏపుగా పెరిగిన తర్వాత కలియదున్నడం వల్ల వరి పంటకు సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా అందుతాయ ని చెప్పారు. ఎకరానికి 12 కిలోల నవధాన్యాలు చల్లాలని సూచించారు. అనంతరం రైతులకు నవధాన్యాల విత్తన కిట్లను అందజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తవలస : చీడవలసలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అద్దె భవనాల్లో అవస్థలు

- అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత గూడు కరువు
- గజపతినగరం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య: 62
- వీటిలో సొంత భవనాలు ఉన్నవి: 25
- అద్దె భవనాల్లో నడుస్తున్నవి: 23
- ప్రభుత్వ పాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్నవి : 14
- అద్దె భవనాల్లో కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, సిబ్బంది



చిట్టేయవలసలో ఇరుకు గదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

గజపతినగరం రూరల్: మండలంలోని పలుగ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాలు ఇరుకు గదులు కావడం, కనీస వసతులు లేకపోవడంతో ఇటు చిన్నారులకు అటు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవు. మరికొన్నింటికి విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ ఫ్యాన్‌లు లేకపోవడంతో చిన్నారులు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. గజపతినగరం మండలం పరిధిలో మొత్తం 62 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.వీటిలో 25 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 23 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మిగతా 14 కేంద్రాలను అద్దె చెల్లించాల్సిన అవసరం లేని ప్రభుత్వ పాఠశాల భవనాలు, ఇతర ప్రభుత్వ భవనాల్లో నడుపుతున్నారు. 23 కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి నెలకు రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు.



కొణిశ గ్రామంలో పెంకుటింటిలో అద్దెకు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

నిబంధనల ప్రకారం..

అంగన్‌వాడీ కేంద్రాన్ని కనీసం అయిదు సెంట్లు ఉన్న స్థలంలో నిర్వహించాలి. కేంద్రం ఆవరణలో చేతిబోరుతో పాటు, మరుగుదొడ్ల సౌకర్యం కలిగి ఉండాలి. చిన్నారులు ఆడుకునేందుకు కేంద్రం ఆవరణలో ఖాళీ స్థలం ఉండాలి. కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలా. ప్రీస్కూల్ నిర్వహణకు, చిన్నారులు ఆడుకునేందుకు విశాలమైన హాల్ ఉండాలి. వీటితో పాటు అప్పుడప్పుడూ గర్భిణులు,బాలింతలతో సమావేశాల నిర్వహణకు వీలుగా భవనంలో సరిపడా స్థలం ఉండాలి.అలాగే భవనానికి విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్‌లు ఉండాలి. కానీ అద్దె భవనాల్లో ఈ సౌకర్యాలు ఏమీ లేవు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమ ర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సొంత భవనాలు మంజూరు చేయాలని అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవన నిర్మాణాలు జరుగుతున్నాయి



గజపతినగరం మండలంలో 23 కేంద్రాలు అద్దె ఇళ్లల్లో నిర్వహిస్తున్నాం. ఒక్కో కేంద్రానికి నెలకు రూ.1500 నుంచి రూ.2వేల వరకు అద్దె చెల్లిస్తున్నాం. పలుగ్రామాల్లో భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తికాగానే ప్రారంభిస్తాం. అంత వరకు కొంత ఇబ్బందులు తప్పవు.

– నాగమణి, ఐసీడీఎస్ పీఓ, గజపతినగరం